# అన్నప్రాశన



కె. తాయారమ్మ

**ఉదయం తొమ్మిది గంటల వేళ ఈజీ చైర్లో కూచుని ఏదో పుస్తకం చదువుకుంటున్నారు వైకుంఠంగారు.**

పోస్ట్‌మేన్ ఓ కవరందించి పోయాడు. కళ్ళ జోడు సవరించుకుని ఫ్రమ్ అడ్రసు చేశారు. అది కూతురు స్వతంత్రభారతి దగ్గరనుంచి. ఆయన కవరు చించుతూ భార్యను పిలిచారు. "ఏమోయ్ స్వరాజ్యం నీ కూతురు దగ్గరనుంచి ఉత్తరం వచ్చిందోయ్" అంటూ.

ఆవిడ వచ్చింది.

"ఇదిగో చదువుతున్నాను విను" అంటూ చదవసాగారు.

"నాన్నా"

"బాబిగాడికి పదవ నెల వచ్చింది. అన్నప్రాశన చెయ్యాలనుకుంటున్నాము. పాప తరువాత ఆరేళ్ళకి పుట్టాడుగా. అందుచేత కొంచెం వైభవంగానే చెయ్యాలని వుంది. ఇక్కడే అన్నప్రాశన జరిపించాలని, మీరందరూ రావాలనీ నాకుంది. కాని మా అత్త గారు, మామగారు, మీ అల్లుడుగారు ఇక్కడ వద్దం టున్నారు. పైగా మీరంతా వస్తే వాళ్ళు భరించలేరట.

వాళ్ళు ఎందుకిలా మారిపోయారో అర్థం కావడం లేదు. ఇదివరకు మేము కాకినాడలో వున్నప్పుడు పాప అన్నప్రాశనకి వాళ్ళే కోరి మిమ్మల్ని పిలిచారు. కానీ ఇప్పుడు పరిస్థితులు తారుమారయ్యాయి.

"నాన్నా ఒక్కమాట .. బాబిగాడి అన్నప్రాశన మీ ఇంట్లో చెయ్యాలని వుంది. మేమే అక్కడికి వస్తాము. ఏమంటావు? ఏ సంగతీ రాయి"

ఇట్లు
నీ కుమార్తె
స్వతంత్రభారతి

ఉత్తరం చదవడం ముగించి భార్య ముఖంలోకి చూశాడు వైకుంఠంగారు.

❋ ❋ ❋

ఆ రోజు బాబిగాడి అన్నప్రాశన. పీట వేసి దాని ముందు పుస్తకాలు, బంగారం, పెన్ను ఇంకా ఎన్నో విలువైన వస్తువులు ఉంచారు.

బాబిగాణ్ణి పీట మీద కూచోపెట్టారు.

"వాడు అందులో ఏ వస్తువు ముట్టుకుం టాడా?" అని అందరూ ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

ఆ రోజు ఏ వస్తువు ముట్టుకుంటే దానితో ఆ వ్యక్తి భవిష్యత్తు నిర్ణయింపబడుతుంది.

కాని బాబిగాడు ఏమీ ముట్టుకోవడంలేదు.

ఎప్పుడెప్పుడు తమ పిల్లల అన్నప్రాశనలు జరిగాయో ఏమిటేమిటి ముట్టుకున్నారో, ఇప్పు డెలాంటి పొజిషన్లో వున్నారో అదంతా ఏకరువుపెడుతోంది స్వతంత్రభారతి అత్తగారు.

బాబిగాడు ఏమీ ముట్టుకోవడంలేదు. వాడి కళ్ళు దేనికోసమో అన్వేషిస్తున్నాయి.

అందరూ విసుగెత్తిపోతున్నారు.

తమ పిన్నత్తగారి కూతురు లోకేశ్వరి అన్నప్రాశననాడు పెన్ను ముట్టుకుందిట. ఇప్పుడామె పెద్ద రచయిత్రి అయి కూచుంది. అంటూ మళ్ళీ మొదలెట్టింది స్వతంత్రభారతి అత్తగారు.

ఇదంతా వింటున్న స్వతంత్రభారతి మామగారు మాత్రం మా చెడ్డ చిరాకుపడ్డారు. "చాల్లే ఇంక ఊరుకో. మా చిన్నప్పుడు మా దూరపు బంధువులబ్బాయి ఒకడు అన్నప్రాశన నాడు పులుసు గరిటె ముట్టుకున్నాడు. వాడు పెరిగి పెద్దవాడయి వంటవాడయ్యాడు. అదే చెప్తామా? ముందు బాబిగాణ్ణి ఫ్రీగా వదిలిపెట్టండి. వాడికి ఏది తోస్తే అది ముట్టుకుంటాడు" అన్నారాయన.

అందరికీ అది సబబుగా తోచింది.

బాబిగాణ్ణి అలా వదిలి అందరూ కబుర్లలో పడ్డారు. కొన్ని నిముషాలు దొర్లాయి.

బాబిగాడు ఏమిటి ముట్టుకుంటాడా అన్న ఆత్రుత అందర్నీ తొలిచేస్తోంది.

పీట వైపు చూశారు. కాని బాబిగాడు అక్కడ లేడు.

"వీడేడీ?" అనుకుంటూ అందరూ ఇల్లంతా పరిశీలించారు.

బాబిగాడు ఎక్కడా కనిపించలేదు.

వంటింట్లోకి నడిచారు వాళ్ళంతా.

అక్కడి దృశ్యం వాళ్ళని ఆశ్చర్యంలో ముంచివేసింది.

బాబిగాడు మంచినీళ్ళ బిందె దగ్గర నిలబడి గ్లాసుతో నీళ్ళు ముంచి తాగుతున్నాడు. కొన్ని ఒంటిమీద పోసుకుంటున్నాడు.

"వెర్రినాగన్న నీళ్ళకోసం వాచిపోయాడు" అంటూ వాణ్ణి ఎత్తుకుని "వదినగారూ! ఇప్పుడైనా అర్థమైందా మీకు? మేము ఎందుకు మా ఇంట్లో అన్నప్రాశన వద్దన్నామో?

మా అమ్మా నాన్నా రావడం మీకు ఇష్టం లేదు అంటూ గయ్‌మంది మా కోడలు పిల్ల" అన్నారు స్వతంత్రభారతి అత్తగారు వియ్యపురాలి వైపు చూసి నవ్వుతూ.

"అవును వదినగారూ! ఈయేడంత నీటికొరత మరెప్పుడూ లేదు" అందునా మీ ఊర్లో గుక్కెడు నీళ్ళు కూడా దొరకడం కష్టంగా వుందట" అంది అతి సౌమ్యంగా. స్వతంత్రభారతి తల్లి ఎదుటివాళ్ళ కష్టాన్ని అర్థం చేసుకుంటూ.

"అయితే బాబిగాడు భవిష్యత్తులో ఏమౌతాడో?" ❋